

నిమ్మపల్లిలో మెగా ప్లాంట్ వద్ద డంప్ చేసిన ఇసుకను తీస్తున్న ఎక్స్‌కవేటర్

# గుట్టుగా ఇసుక అక్రమ రవాణా

- నిమ్మపల్లి మెగా ప్లాంట్ నుంచి సిద్దిపేటకు..
- నకిలీ పత్రాలతో టిప్పర్లు, లారీల్లో తరలింపు
- జగిత్యాలకు చెందిన కాంట్రాక్టర్ నిర్వాకం
- వాహనాలను పట్టుకున్న పోలీసులు
- అనుమతులు లేవని చెప్పిన మల్కపేట ప్రాజెక్టు అధికారులు

**నిమ్మపల్లి మోగా కంపెనీ ప్లాంట్ నుంచి గుట్టుగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జగిత్యాలకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్ అధికారుల కళ్లుగప్పి ఈ అక్రమ వ్యవహారానికి తెరలేపాడు. ఏకంగా నకిలీ వే బిల్లులు, అనుమతి పత్రాలు సృష్టించి లారీలు, టిప్పర్లలో సిద్దిపేటకు తీసుకెళ్తూ అందినకాడికి దండుకుంటున్నాడు. పోలీసుల తనిఖీలు చేసి అనుమతుల్లేని ఇసుక వాహనాలను ఠాణాకు తరలించడంతో ఈ గుట్టు రట్టయింది.**

**- కోనరావుపేట, ఆగస్టు 11**



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక టిప్పర్లు

బీఆర్ఎస్ సర్కారు మెట్ట రైతులకు నీరందించాలనే సంకల్పంతో కాళేశ్వరం ప్యాకేజీ-9లో భాగంగా మల్కపేట రిజర్వాయర్ నిర్మాణం చేపట్టింది. ఇందులో భాగంగా లిఫ్టల ద్వారా మండలానికి ప్రధాన జలవనరు అయిన నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టును నింపేందుకు రూ.166 కోట్లు మంజూరు చేసింది. మెగా కంపెనీ పనులు దక్కించుకొని ప్రారంభించింది. పనుల నిర్వహణకు నిమ్మపల్లి శివారులో కంపెనీ బాధ్యులు ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. పైపులు, ఇతర సామగ్రిని ఇందులో నిల్వ ఉంచారు. అప్పటి ప్రభుత్వం ఉచిత ఇసుక రవాణాకు ఉత్తర్వులు ఇవ్వడంతో లిఫ్ట్ పనులకు అవసరమైన ఇసుకను ఇక్కడే నిల్వ చేశారు. కొంతమేర పనులు కూడా పూర్తి చేశారు. అయితే ప్రభుత్వం మారడం..నిధులు రాకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

## నకిలీ పత్రాలతో సిద్దిపేటకు..

పనులు నిలిచిపోవడంతో ఇదే అదనుగా భావించిన కాంట్రాక్టర్ ఇసుక అక్రమ వ్యవహారానికి తెరలేపాడు. డంప్‌పై కన్నేసి గుట్టు చప్పుడు కాకుండా లారీలు, టిప్పర్లతో సిద్దపేటలోని ఎల్యాలపల్లి ప్రాజెక్టుకు తరలించేందుకు సిద్ధమయ్యాడు. నకిలీ పత్రాలను సృష్టించి టిప్పర్లు, లారీల్లో ఇసుకను తరలిస్తుండగా ఆదివారం ఉదయం బ్లూకోల్ట్స్ సిబ్బంది పట్టుకున్నారు. అనుమతిపత్రాలు సరిగాలేని రెండు టిప్పర్లను ఠాణాకు తరలించారు. మరో రెండు టిప్పర్లను ఇసుకలోడ్‌తో ప్లాంట్ వద్దే నిలిపివేశారు.

## రెండు టిప్పర్లను పట్టుకొన్నాం..

ఇసుకను తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేశాం. అనుమతి ఉన్న పత్రాలు సరిగా లేకపోవడంతో రెండు టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించాం. వెరిఫికేషన్ కోసం మైనింగ్ అధికారులతో పాటు ప్రాజెక్టు అధికారులకు పంపించినం. వారు ఇవి నకిలీ పత్రాలు నిర్ధారిస్తే కేసు నమోదు చేస్తాం.

**- శేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ (కోనరావుపేట)**

## పర్మిషన్ ఇవ్వలేదు..

నిమ్మపల్లి మెగా ప్లాంట్‌లో వద్ద గల డంప్ నుంచి ఇసుకను తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అయితే ప్రాజెక్టు వద్ద నిల్వ చేసిన ఇసుకను తరలించేందుకు ఒక రోజు ముందు ఫోన్ చేశారు. కానీ ఇతర ప్రాంతాలను తరలించడానికి కలెక్టర్, మైనింగ్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పిన. కిందిస్థాయి అధికారులకు కూడా ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదు.

**-అమరేందర్‌రెడ్డి, ప్యాకేజ్-9, ఈఈ**

# నగరానికి ఆధ్యాత్మిక శోభ

- తుది దశకు రేకుర్తి ఆలయ పనులు
- అక్టోబర్ 17న స్వామివారి ప్రతిష్ఠాపనోత్సవాలు
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



రేకుర్తిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 11 : ఓ వైపు టీటీడీ టెంపుల్, మరోవైపు సుమారు 1800 ఏళ్ల చరిత్ర కలిగిన రేకుర్తి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంతో కరీం'నగరం' ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. స్వయంభువుగా వెలిసిన రేకుర్తి ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరాయని చెప్పారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 17న స్వామివారి ప్రతిష్ఠాపనోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఆదివారం రేకుర్తిలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. అక్టోబర్ 17న ఉదయం 8 గంటలకు ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మహాకుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. రేకుర్తి నృసింహుడి క్షేత్రం మహిమాన్వితమైనదన్నారు. ఇక్కడ స్వామివారు సుదర్శన చక్రంతో వెలియడంతో ఈ క్షేత్రం మరింత ప్రాశస్త్యాన్ని సంతరించుకున్నదని చెప్పారు. ఉమ్మడి పాలకులు ఆలయాభివృద్ధిని విస్మరించారని ఆక్షేపించారు. 2009లో తాను తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టానన్నారు. 2014లో బీఆర్ఎస్ సర్కారు ఏర్పడిన తర్వాత రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ సహకారం తో ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుకునేందుకు వెళ్లారన్నారు. అయితే, స్వామివారి కటాక్షంతో ఆటంకాల న్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు ఎదుర్ల రాజశేఖర్, సుధగోని మాధవీ కృష్ణగౌడ్ ఉన్నారు.

## అపరిశుభ్రంగా పరిసరాలు

గురుకుల పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అపరిశుభ్రంగా తయారైంది. కనీసం గ్రామ పంచాయతీ నుంచి కూడా గడ్డి మందు కొట్టే పరిస్థితి కనిపించడం లేదు. చెత్తా చెదారం ఉండడంతో విపరీతమైన దోమలు వ్యాపిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. చాలా మందికి జ్వరాలు కూడా వచ్చాయని చెబుతున్నారు. అంతే కాకుండా వసతి గృహంలో బెడ్స్ సరిపోక ఒకే బెడ్‌పై ఇద్దరిద్దరం పడుకుంటున్నామని చెబుతున్నారు..



తరగతి గదుల మధ్య చెత్తా చెదారం

ఫీల్డ్ విజిట్ FIELD VISIT

నిరుపేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో వసతులు కరువయ్యాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో సమస్యలు తిష్టవేశాయి. 'నమస్తే తెలంగాణ' సందర్శనలో వసతులు లేక విద్యార్థులు పడుతున్న అవస్థలు బయటపడ్డాయి. ఇందులో తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఒకటి. మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలానికి మంజూరైన ఈ పాఠశాలకు అక్కడ వసతి లేని కారణంగా ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏమైనా వసతులు ఉన్నాయా? అంటే అవీ లేదు. రేకుల షెడ్డు, చెట్ల కింద పాఠాలు, మూత్రశాలలు లేని వసతి గృహం, దుర్గంధంతో నిండిన పరిసరాలు.. ఇలా నిత్యం ఇవే సమస్యలపై విద్యార్థులు కుస్తీ పట్టాల్సి వస్తోంది. ఇక్కడి సమస్యల గురించి విద్యార్థులను అడిగితే చాలుపోమ్మని చెప్పేస్తున్నారంటే వారు నిత్యం అనుభవిస్తున్న నరకం ఎలాంటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

**- కరీంనగర్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ)/ తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో చెట్ల కిందనే పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు

- నరక ప్రాయంగా గురుకులాలు
- అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు
- డ్రైనేజీ క్లియర్ లేక నిత్యం దుర్గంధం
- రేకుల షెడ్లు.. చెట్ల కింద తరగతులు
- ఎండకు ఉడికి పోతున్న విద్యార్థులు
- ఐదు నెలలుగా రాని మెస్ బిల్లులు
- నాణ్యత తగ్గిన భోజనంతోనే సరి

# వసతులు కరువు.. చదువులు బరువు



అపరిశుభ్రంగా ఉన్న ట్యాప్ వద్ద నీరు తాగుతూ..

తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో అలా అడుగు పెట్టామో లేదో.. ముక్కుపుటాలు ఎగిరి పోయే దుర్గంధం. ఏమిటిదని విద్యార్థులను అడిగితే డ్రైనేజీ వాసనని చెప్పారు. సుమారు 420 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలకు సరైన డ్రైనేజీ సదుపాయం లేదు. విద్యార్థులు వాడిన వ్యర్థపు నీరు వసతి గృహం వెలుపలకు వెళ్లే మార్గం లేక అక్కడే డ్రైనేజీలోనే మురిగి మురిగి కంపు వెదజల్లుతోంది. ఈ దుర్గంధం తీవ్రస్థాయిలో ఉన్నా విద్యార్థులు సర్దుకుపోతున్నారు. డ్రైనేజీని తరగతి గదుల పక్క నుంచే నిర్మించి పైన కప్పు వేశారు. అందులోంచి మురుగు నీరు లీకవుతూ దుర్గందాన్ని వెదజల్లుతోంది. ఈ దుర్గందంలోనే విద్యార్థుల తరగతులు కొనసాగుతున్నాయి.. ఆఖరికి భోజనాలు కూడా ఇదే దుర్గందంలో చేయాల్సిన దుస్థితి. వసతి గృహాన్ని కూడా చుట్టేసిన ఈ దుర్గంధంలోనే విద్యార్థులు నిద్రపోతున్నారు. వాసన పడక కొందరు వాంతులు చేసుకుంటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అనుక్షణం ఈ దుర్గంధంలో గడుపుతున్న చిన్నారుల ఆరోగ్యం ఎలా ఉంటుందో ప్రభుత్వ పెద్దలు ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉన్నది.

## రేకుల షెడ్ల కిందనే తరగతులు

ఈ గురుకుల పాఠశాలలో 420 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదు నుంచి పదో తరగతి వరకు రెండేసి సెక్షన్లు ఉన్నాయి. తరగతుల నిర్వహణకు రేకుల షెడ్లు వేశారు. చిన్న ఎండ కొట్టినా రేకులు వేడెక్కి వీటి కింద ఉన్న విద్యార్థులపై ప్రభావం చూపుతోంది. ఫ్యాన్లు తిరుగుతున్నా వేడిని తట్టుకోలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. తరగతి గదులు ఈ విధంగా ఉంటే చదువులు ఎలా ముందుకు సాగుతాయని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు తరగతి గదుల పక్క నుంచే దుర్గందం వెదజల్లే డ్రైనేజీ ఉండడంతో ఇటు వాసన, అటు ఉక్కపోతతో విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదు. తరగతి గదులకు కనీసం వెంటిలేషన్స్ కూడా సరిగ్గా లేక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పక్కనే కమర్షియల్ షాపింగ్స్ ఉన్నాయి. అక్కడ ఎవరైనా సిగరెట్లు, బీడీలు తాగితే క్లాస్ రూంలకు పొగ వాసన కూడా వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ కారణంగా పాఠశాల ఆరుబయట ఉన్న చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు.

## మూత్రం వస్తే అంతే సంగతులు..

వసతి గృహంలో మూత్ర శాలల సదుపాయం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కొన్ని ఉన్నా వాటిని మూసేశారని, మూడంతస్తుల్లో ఉన్న ఈ భవనానికి రాత్రి 9 గంటలకు తాళం వేస్తారని, రాత్రి వేళ మూత్రం వస్తే కిందికి దిగే అవకాశం ఉండదని ఆవేదన చెందుతున్నారు. ఉదయం 5.30 గంటలకు తాళం తెరిచిన తర్వాతనే విద్యార్థులు కింద ఉన్న మూత్ర శాలలలకు వెళ్లాలి. కింద ఉన్న మూత్ర శాలలు కూడా సౌకర్యవంతంగా లేవు. కొన్నింటిలోనే నీటి సదుపాయం ఉంది. మిగతా వాటిలో మూత్రానికి, మరుగుదొడ్డికి వెళ్లాలన్నా పిల్లలే బకెట్లతో నీటిని తీసుకెళ్లాలి. విద్యార్థులు భోజనానికి ముందు, తర్వాత చేతులు కడుక్కోవడానికి ట్యాప్స్‌లేవు. ఒకేసారి నల్లాలు విడిస్తే కడుక్కోవాలి. ముందుగా వెళ్లిన స్నానం చేసిన వారికే నీళ్లు అందుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.



పాఠశాలలో కిచెన్



రేకుల షెడ్డు కిందే పాఠాలు వింటున్న విద్యార్థులు

## అందుబాటులో లేని ఆట స్థలం

ఈ పాఠశాలలో కనీసం ఆట స్థలం కూడా లే దు. వసతి గృహం పక్కన ఉన్న రియల్‌ఎస్టేట్ చేసిన ప్లాట్లలో విద్యార్థులు ఆడుకుంటున్నారు. అయితే, ఈ స్థలం యజమాని కూడా ఇటీవల తనకు రెంట్ చెల్లించాలని నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. ఇందులో ఇండ్లు నిర్మించుకుంటే ఈ స్థలం కూడా విద్యార్థులకు దక్కకుండా పోతుంది.

## ఐదు నెలలుగా రాని బిల్లులలు

గురుకుల పాఠశాలలకు 2016లో పెంచిన మెనూ బిల్లులే ఇప్పటికీ నడిపిస్తున్నారు. ఈ సమయంలో ఐదు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు నెలకు రూ.950, 8వ తరగతి నుంచి 10 వరకు చదివే విద్యార్థులకు రూ.1,100, ఇంటర్ విద్యార్థులకు రూ.1,500 చొప్పున చెల్లిస్తున్నారు. అయితే, ఇప్పుడు కూరగాయలు, గుడ్లు, అరటి పండ్లు, చికెన్, మటన్ ధరలు విపరీతంగా పెరిగాయి. అవే ధరలతో వీటిని అందించడం సాధ్యం కావడం లేదని ఆయా ఏజెన్సీల నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లులకు తగినట్లుగా మెనూను రూపొందించుకోవల్సి వస్తోందని అంటున్నారు. ప్రతి రోజూ ఇచ్చే అరటి పండ్లు, గుడ్లు దినం విడిచి దినం ఇవ్వాల్సి వస్తోందని చెబుతున్నారు. పప్పులు, చారు, ఇతర కూరలు కూడా మునుపటిలా ఉండడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. అయితే, గత మార్చి నుంచి ఈ బిల్లులు కూడా రాకపోవడంతో తమపై భారం పడుతోందని మరో పక్క ఏజెన్సీల నిర్వాహకులు వాపోతున్నారు.

## హాస్టల్లో బాత్రుంలు లేవు



హాస్టల్లో బాత్రుంలు లేవు. ఉన్న వాటిని సీజ్ చేశారు. కొన్నింటికి అటాచ్ బాత్ రూంలు ఉన్నాయి. వాటికి తలుపులు లేవు. నీళ్లు రావు. రాత్రి 9 గంటలకు కింద తాళం వేస్తారు. పై నుంచి కిందికి రానీయరు. మూత్రం వస్తే పొద్దున 5.30 గంటలకు తాళం తీసిన తర్వాతనే బాత్రూమ్‌కు వెళ్లాలి. మూత్రం ఆపుకుంటే కొందరికి కడుపు నొప్పులు వచ్చాయి.

**- ప్రేమ్ రక్షిత్, విద్యార్థి**

## జారి పడితే దెబ్బ తాకింది..



హాస్టల్లోని డార్మెంట్‌లో డ్రైనేజీ పైపులు లీకవుతున్నాయి. చూసుకోకుండా తడిపై కాలు వేస్తే పడిపోయా. దెబ్బ తగిలింది. హాస్టల్ గదుల్లోకి కోతులు కూడా వస్తున్నాయి. భయపెడుతున్నాయి. గదుల పక్కనే చెత్తా చెదారం వేయడం వల్ల దుర్వాసన వస్తోంది. వర్షం పడితే గోడలకు కరెంట్ షాక్ వస్తోంది..

**- సిద్దార్థ, విద్యార్థి**

## షాక్ వస్తే ఎగిరి పడ్డా..



హాస్టల్లో కిటికి తీసేందుకు వెళ్లితే కరెంట్ షాక్ వచ్చింది. అందురూ చూస్తుండగానే ఎగిరి పడ్డా. మళ్ల కిటికీలు ఎవరం ముట్టుకోవడం లేదు. కరెంట్ స్విచ్ బోర్డుల నుంచి వైర్లు బయటికి వస్తున్నాయి. ఫ్యాన్లు వేసుకోవాలన్నా భయమే. ఎక్కడ కరెంట్ వస్తుందోనని భయపడుతున్నాం.

**- అరుణ్‌కుమార్, విద్యార్థి**

## స్కిన్ ఎలర్జీ వస్తోంది..



స్నానం చేసేందుకు మంచి నీళ్లు లేవు. నీళ్లు బాగా లేక స్కిన్ ఎలర్జీ వస్తోంది. ఒకరికి దురద వస్తే ఇంకొకరికి అంటుకుంటోంది. పుండ్లు కూడా అవుతున్నాయి. ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులకు టీచర్స్ కూడా లేరు. త్వరగా భర్తీ చేయాలని కోరుకుంటున్నాం.

**- శివమణి, విద్యార్థి**

# ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు..

మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌కు బీసీ బాలికల గురుకులం విద్యార్థినుల మొర



విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, ఆగస్టు 11: 'ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు సార్.. వెంటనే బదిలీ చేయించండి.. సమస్యలు చెబితే టార్గెట్‌చేసి మరీ తిడుతోంది'.. అంటూ మధురానగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మొర పెట్టుకున్నారు. 'గురుకుల చుట్టూ అన్ని సమస్యలే' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం చూసిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పందించి, ఆదివారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారం కాకుంటే విద్యార్థినులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## ప్రిన్సిపాలే ప్రధాన సమస్య

గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రధాన సమస్యగా మారారని విద్యార్థులు మాజీ ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. పాఠశాల బిల్డింగ్ సరిగ్గా లేదని, బాత్‌రూంలో లైట్లు లేవని, అన్నంలో పురుగులు వస్తున్నాయని ప్రిన్సిపాల్‌కు చెబితే.. పట్టించుకోకుండా మాటలతో మానసికంగా వేధిస్తోందని వాపోయారు. ప్రిన్సిపాల్ సమయపాలన పాటించరని, ఫొటోల కోసం మళ్లీ రెండోసారి ప్రేయర్ చేయిస్తున్నారని, ఇదేంటని అడిగితే టీసీలు ఇచ్చి పంపిస్తానని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని దుయ్యబట్టారు. పాఠశాలలో 600 మంది విద్యార్థినులు ఉంటే, కేవలం ఏడు బాత్‌రూమ్‌లు ఉండడం ఏంటని ప్రశ్నించారు. అన్నంలో పురుగులు.. పాఠశాలల్లోకి పాములు వచ్చినా పట్టించుకునే వారు లేరని మండిపడ్డారు.



కేజ్‌వీల్స్ రోడ్డుపై తగలకుండా మరో ట్రాక్టర్ హైడ్రాలిక్ పట్టీలతో తీసుకెళ్తున్న యజమాని

# శభాష్.. గంగాధర్!

- కేజ్‌వీల్స్ కింద తాకకుండా తీసుకెళ్లిన ట్రాక్టర్ యజమాని
- అభినందించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11: ''శభాష్.. గంగాధర్. రోడ్లు పాడవకుండా ప్రతి ఒక్కరూ నీలా ఆలోచించాలి'' అంటూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కేజ్‌వీల్స్ కింద తాకకుండా తీసుకెళ్తున్న ట్రాక్టర్ యజమానిని రోడ్డుపై ఆపి అభినందించారు. మెట్‌పల్లి మండలం రామారావుపల్లెకు చెందిన విలాసాగర్ గంగాధర్ ట్రాక్టర్ నడుపుకుంటూ ఉపాధి పొందుతుండగా, నెల రోజులుగా తన ట్రాక్టర్‌కు కేజ్‌వీల్ వేసి పొలం దుక్కులు దున్నుతున్నాడు. అయితే, కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్‌ను రోడ్డు దాటించే క్రమంలో రోడ్డు చెడిపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాడు. తన కేజ్‌వీల్ ట్రాక్టర్ వెనకాల హైడ్రాలిక్ పట్టీలకు మరో ట్రాక్టర్ హైడ్రాలిక్ పట్టీలతో అటాచ్ చేశాడు. టైర్లతో ఉన్న ట్రాక్టర్ హైడ్రాలిక్ పట్టీలను పైకి లేపి తన ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌ను రోడ్డుకు తగలకుండా జాగ్రత్తగా తీసుకెళ్తున్నాడు. ఇలాగే ఆదివారం రోడ్డుపై వెళ్తుండగా, ఆ సమయంలో అటుగా వెళ్తున్న కోరుట్ల ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి సదరు ట్రాక్టర్ యజమానితో మాట్లాడారు. సామాజిక బాధ్యతతో రోడ్డు చెడిపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నదుకు గంగాధర్‌ను అభినందించారు. నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో సుమారు రూ.500 కోట్లతో రోడ్లను బాగు చేసుకున్నామని ఎమ్మెల్యే గుర్తు చేశారు.



గంగాధర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

# గురుకులంలో మెరుగైన వసతికి చర్యలు

- గురుకుల విద్యాలయాల రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రమణకుమార్
- పెద్దాపూర్ గురుకుల పాఠశాల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న గురుకుల విద్యాలయాల రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రమణకుమార్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11: మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు గురుకుల విద్యాలయాల రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ తెలిపారు. పక్షం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం, నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనతో పెద్దాపూర్ గురుకులాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న పారిశుధ్య పనులు, కొత్త భవనంలో చేపడుతున్న విద్యుత్ పనులను పరిశీలించి, పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. రెండు రోజులు ఇక్కడే ఉండి పనులను పర్యవేక్షించాలని సొసైటీ ఇంజినీరింగ్ విభాగం డీఈ యూసుఫ్‌ను ఆదేశించారు. అలాగే, విద్యార్థులకు అవసరమైన డబుల్‌కాట్ బెడ్లు, బెడ్‌షీట్లు, డైనింగ్ హాల్ విస్తరణ, కొత్త భవనంలో కిటికీలకు దోమ తెరల ఏర్పాటుకు నివేదిక పంపాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డికి తెలిపారు. నివేదిక ఆధారంగా విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571